www.prajasakti.com

ప్రజాశక్తి

గురువారం 4 డిసెంబర్ 2025

కేంద్రీయ విద్యాలయాన్ని ప్రారంభించండి

- కేంద్ర విద్యాశాఖ మంత్రికి ఎంపీ మిథున్‌రెడ్డి వినతి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మదనపల్లె పట్టణ కేంద్రానికి మంజూరైన కేంద్ర విద్యాలయాన్ని ప్రారంభించాలని రాజంపేట పార్లమెంట్ సభ్యులు (ఎంపీ) పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి బుధవారం కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఎంపీ మిథున్‌రెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వం లోనే మదనపల్లెలో కేంద్ర విద్యాలయం ప్రారంబించేందుకు అనుమతులు లభించాయన్నారు. 2025-26 విద్యా సంవత్సరంలోనే కేంద్ర విద్యాలయం ప్రారంభం కావాల్సి ఉందన్నారు. పరిపాలన కారణాలవల్ల ఈ ఏడాది ఆలస్యం అయిందని, వచ్చే విద్యా సంవత్సరం 2026-27లో తప్పక ప్రారంభించాలని కేంద్రమంత్రిని కోరినట్లు తెలిపారు.

కేంద్ర మంత్రికి వినతిపత్రం ఇస్తున్న రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డి

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

ప్రజాశక్తి-రాయచోటి

రైతు సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం రైతన్నా..మీకోసం వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని రవాణా, యువజన, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండలంలోని గొర్ల ముదివేడు రైతు సేవా కేంద్రంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వ్యవసాయంలో పంచ సూత్రాలపై ఏడు రోజుల పాటు కార్యక్రమాలు నిర్వహించామని, అగ్రిటెక్‌పై రైతుల్లో చైతన్యం తీసుకు వచ్చామన్నారు. వ్యవసాయ రంగంలో పెనుమార్పుల ద్వారా సాగును లాభసాటి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం పలు కార్యక్రమాలను చేపడుతోందన్నారు. నవంబర్ 24వ తేదీ నుంచి 29వ ప్రతీ రైతు ఇంటికి ప్రజాప్రతినిధులు బుధవారం రైతు సేవా కేంద్రాల పరిధిలో వర్క్ షాపులు చేపట్టామనన్నారు. ఇప్పటికే అన్నదాత సుఖీభవ-పిఎం కిసాన్ కింద దాదాపు 46.50 లక్షల మందికి పైగా రైతులకు రెండు విడతలుగా రూ.14 వేలు జమ చేశామన్నారు. రెండు విడతల్లో కలిపి రూ.6,310 కోట్లు రైతులకు చెల్లించాం. బిందు సేద్యానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నాంన్నారు. పొలం పిలుస్తోంది కార్యక్రమం కూడా చేపడుతున్నాంన్నారు. ఇలాంటి వాటితో పాటు వ్యవసాయాన్ని మరింత అభివృద్ధి చేయడం ద్వారా అన్నదాతలకు మరింత మేలు చేకూర్చేలా పంచ సూత్రాలను ప్రకటించామన్నారు. నీటి భద్రత, డిమాండ్ ఆధారిత పంటలు, అగ్రిటెక్, ఫుడ్ ప్రాసెసింగ్, ప్రభుత్వాల మద్ధతు అనే అంశాలతో పంచ సూత్రాల విధానాన్ని చేపట్టాంన్నారు. ఈ పంచసూత్రాలను ప్రతి రైతుకే కాకుండా రైతు కుటుంబ సభ్యులకు కూడా అవగాహన కల్పించాలనన్నారు. కార్యక్రమంలో ద్వారా చేపట్టిన కార్యక్రమాలను రైతులకు ఎల్లవేళలా వ్యవసాయ శాఖ సిబ్బంది అందుబాటులో ఉండి అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో తాసిల్దార్ నరసింహా కుమార్, మార్కెట్ కమిటీ చైర్మన్ అనుంపల్లి రాంప్రసాద్ రెడ్డి, వ్యవసాయ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

రైతులతో మాట్లాడుతున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

దిత్వా తుపాన్‌తో స్తంభించిన జనజీవనం

- బురదమయమైన రహదారులు
- తీవ్ర ఇబ్బందులు పడ్డ విద్యార్థులు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

దిత్వా తుపాన్ ప్రభావంతో నాలుగు రోజులుగా పట్టణంలో జనజీవనం స్తంభించింది. ఉదయం, రాత్రి ఎడతెరిపి తేలికపాటి వర్షపు చినుకులు పడుతుండడంతో జనజీవనం స్పందించింది. ఇంట్లోంచి బయటకు వెళ్లాలంటే ప్రజలు తీవ్ర అవస్థలు పడ్డారు. ముఖ్యంగా దిత్వా తుపాన్ ప్రభావం పెద్దగా లేనప్పటికీ నానుపు వానతో పాఠశాల, కళాశాలకు వెళ్లాల్సిన విద్యార్థులు ఉపాధ్యాయులు, అధ్యాపకులు సిబ్బంది తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల రోడ్లు చిద్రం కావడంతో ప్రయాణ సౌకర్యం లేక గ్రామస్తులు, రైతులు, విద్యార్థులు, కూలీలు తీవ్ర ఇబ్బందిపడ్డారు. ఆటో నిర్వాహకులు ఇదే ఆదునుగా రవాణా ఛార్జీలను అధిక సంఖ్యలో పెంచి సొమ్ము చేసుకున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ముఖ్యంగా రైతులు వ్యవసాయ పొలాల్లో పనులు చేసుకోవడానికి వీలు కలగలేదు. ఎక్కువ మంది కూలీలు పనులు దొరక్క ఇంటిపట్టునే ఉండడంతో వారి జీవన ప్రమాణాలు దెబ్బతిన్నాయి. కూలిలకు ఉపాధి పనులు, రైతులకు వ్యవసాయ పనులు, భవన నిర్మాణ పనులు అన్ని స్తంభించిపోయాయి. నాలుగు రోజులుగా ప్రజలు ఇళ్లకే పరిమితం కావాల్సి వచ్చింది. కాలువల్లో మురుగునీరు ప్రవహిస్తూ రోడ్లపైకి రావడంతో దుర్గంధం వెదజల్లుతోంది. ముఖ్యంగా పట్టణంలోని పలు కాలనీల రోడ్లు గుంతల మయం కావడంతో నీరు చేరి చిన్నపాటి నీటి కుంటలను తలపించాయి. వాహనాలు ఆ నీళ్లల్లో వెళ్ళినప్పుడు బాటసారుల పైకి నీళ్లు ఎగరడంతో అక్కడక్కడ చెదురు ముదురు ఘటనలు చోటు చేసుకున్నాయి. దిత్వా తుపాన్ నాలుగు రోజులుగా వెంటాడడంతో సూర్యుడు కనుమరుగయ్యాడు. రేయింబవళ్లు తేలికపాటి చిరుజల్లులు కురుస్తుండడంతో పారిశుద్ధ్య కార్మికులు ఆ వర్షములోనే పనులు చేయాల్సి వచ్చింది. తుపాన్ ప్రభావం వల్ల మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు. మున్సిపాలిటీ పరిధిలో పునరావస కేంద్రాలను ఏర్పాటు చేశారు.

నీటి కుంటను తలపిస్తున్న రోడ్డు

ఘనంగా టౌన్ బ్యాంకు శత వార్షికోత్సవాలు

శతవార్షికోత్సవ ఉత్సవాల మ్యానిఫెస్టోను ఆవిష్కరిస్తున్న ముఖ్య అతిథులు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మదనపల్లె కో-ఆపరేటివ్ టౌన్ బ్యాంక్ శత వార్షికోత్సవ వేడుకలు బుధవారం పట్టణంలోని ఎస్వీఆర్ కల్యాణ మండపంలో కనుల పండుగ లా జరిగాయి. ఈ శత వార్షికోత్సవ ఉత్సవాలకు ముఖ్య అతిథులుగా మదనపల్లి ఎమ్మెల్యే షాజహాన్‌బాషా, పలమనేరు ఎమ్మెల్యే అమర్నాథ్‌రెడ్డి, పీలేరు ఎమ్మెల్యే కిషోర్ కుమార్ రెడ్డి, చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తినాని, చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌రాజు, పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్, ఎమ్మెల్సీ శ్రీధర్ ఉడా చైర్మన్ డాక్టర్ సురేష్ బాబు హాజరయ్యారు. ముఖ్య అతిథులను టౌన్ బ్యాంక్ చైర్మన్ నాదెళ్ల విద్యాసాగర్, వైస్ చైర్మన్ మహర్షి, డైరెక్టర్లు జోలపాళం దేవేంద్ర అలియాస్ చిన్ని సోము, భాస్కర్ తదితరులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు, కోలాటాలు, చెక్కభజనలు, కొమ్ము వాయిద్యాలు, ఎంతో విశేషంగా ఆకట్టుకున్నాయి. అనంతరం సభా వేదికపైకి బ్యాంకు చైర్మన్ నాదెళ్ల విద్యాసాగర్ ముఖ్య అతిథులను ఆహ్వానించి, పుష్పగుచ్చం, శాలువా, పూలమాలతో ఘనంగా సత్కరించారు. అనంతరం శత వార్షికోత్సవ ఉత్సవాల మ్యానిఫెస్టోను విడుదల చేశారు. ముందుగా టౌన్ బ్యాంక్ చైర్మన్ నాదెళ్ల విద్యాసాగర్ మాట్లాడుతూ 1924లో గంగారపు పెద్దప్పరెడ్డి రూ.410 డిపాజిట్ రుసుంతో 30 మంది సభ్యులతో కో-ఆపరేటివ్ టౌన్ బ్యాంకును ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అప్పటినుంచి ప్రజాసేవలో కొనసాగుతూ ప్రజల ఆదరణ చూరగొంటూ అత్యంత విలువైన సేవలు అందిస్తూ అనతి కాలంలోనే రుణాలు మంజూరు చేస్తూ ఎంతో ప్రజాభిమానం చురగొందన్నారు.వందేళ్ల కో-ఆపరేటివ్ టౌన్ బ్యాంక్ చరిత్రలో ప్రస్తుతం రూ.100 కోట్ల డిపాజిట్లు, రూ.120 కోట్ల టర్నోవర్ తో ఖాతాదారులకు మెరుగైన సేవలను అందిస్తూ దూసుకు పోతుందన్నారు. ప్రస్తుతం మూడు బ్రాంచ్‌లతో ఈ టౌన్ బ్యాంకు కొనసాగుతుందని తెలిపారు. మ్మెల్యేలు మాట్లాడుతూ ఎంతో ఆదరణ చూరగొన్న కో-పరేటివ్ టౌన్ బ్యాంకు సేవలు ప్రజలకు మరింత చేరువ చేయాలని పిలుపునిచ్చారు. ఖాతాదారుడు బ్యాంకుకు వచ్చినపుడు వారిని సాదరంగా ఆహ్వానించి, వారికి కావాల్సిన సేవలను అనతి కాలంలోనే అందించడంతో ఇంత మంచి పురోగతి సాధించిందన్నారు. ప్రభుత్వం తరపున టౌన్ బ్యాంక్‌కు అవసరమైన మరిన్ని సౌకర్యాలను కల్పించేందుకు కృషి చేస్తామన్నారు. మదనపల్లె జిల్లా అమల్లోకి వచ్చిన వెంటనే ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటన ఉంటుందని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా తెలిపారు. కార్యక్రమంలో మిట్స్ ఛాన్సలర్ డాక్టర్ విజయభాస్కర్ చౌదరి, విజయభారతి డాక్టర్ ఎన్ సేతు, మార్వారి సుధాకర్ నాయుడు, ఆర్‌జె వెంకటేష్, డైరెక్టర్లు, ఖాతాదారులు, బ్యాంకు ఉద్యోగులు, సిబ్బంది, పట్టణ ప్రముఖులు, అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

పంచ సూత్రాలు రైతులకు లాభసాటి : కలెక్టర్

రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్ నిశాంత్ కుమార్

ప్రజాశక్తి-వీరబల్లి

పంచ సూత్రాల అమలుతో రైతులకు లాభసాటి వ్యవసాయం అవుతుందని, అధిక లాభాలు పొందవచ్చునని కలెక్టర్ నిశాంత్‌కుమార్ పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలోని రైతు సేవా కేంద్రంలో రైతన్నా మీకోసం కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులతో పలు అంశాలపై చర్చించి వారి సమస్యలను, సలహాలను తెలుసుకుని అధికారులకు దిశా నిర్దేశం చేసి వీటికి సంబంధించిన ప్రణాళికలను తయారు చేసుకోవాలని సూచించారు. రానున్న ఐదు సంవత్సరాలలో రైతులకు వ్యవసాయం లాభసాటి కావాలనే ఉద్దేశంతో ప్రభుత్వం పంచ సూత్రాలలక్ష్యంగా నీటి భద్రత, డిమాండ్ ఆధారిత పంటలు, అగ్రిటెక్, ఫుడ్ ప్రాసెసింగ్,ప్రభుత్వాల మద్దతు అందించే విధంగా కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. రైతులకు సబ్సిడీపై మేలైన విత్తనాలు, ఎరువుల పంపిణీ చేయడం జరిగిందని, కాలువల పూడికతీత, సకాలంలో నీటి విడుదల, వాన నీటి సంరక్షణ, నదుల అనుసంధానం ద్వారా ప్రతి ఎకరాకు నీరందేలా 'మెరుగైన సాగునీటి విధానం' ఈ ప్రభుత్వం చేపడుతున్నద తెలిపారు. జిల్లాలో రైతులందరూ ఆయిల్ ఫామ్ వైపు ముగ్గు చూపాలని తద్వారా అధిక లాభాలు ఎక్కువగా ఉన్నాయన్నార. పశు సంవర్ధక శాఖ, ఆర్ఎస్‌కె సిబ్బంది పాడి పశువులకు, గేదలు కావలసిన వారి జాబితాను తయారు చేయాలని, వాటిని సబ్సిడీపై మహిళల పేరుతో లోన్ లు ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటుందని తెలిపారు. తద్వారా పాలు దిగుబడి పెరిగి రైతులకు ఆదాయం వచ్చేందుకు వీలవుతుందన్నారు. మండలంలో 9,188 ఎకరాలు సాగు భూమి ఉందని అందులో మామిడి 5,667 ఎకరాలు, వరి 1100 ఎకరాలు, వేరు శెనగ 350, ఉలవ 750, స్ప్రింక్లర్స్ ద్వారా వివిధ పంటలను 1858 హెక్టార్ల ద్వారా పంటలను పండించడం జరుగుతున్నదని, రైతులు డ్రిప్ ద్వారా పంటలను పండించేందుకు ప్రభుత్వం నుండి సబ్సిడీ కి డ్రిప్ పరికరాలు అందించాలని కోరారు. రాబోయే రోజులలో ఆయిల్ ఫార్మ్ సాగులో, ఇతర పంటలలో రైతులకు మంచి లాభాలు ఉన్నాయని వాటివైపు రైతులు కుడా మొగ్గు చూపి సాగు చేయాలని కలెక్టర్ సూచించారు. ఈ ప్రాంతంలో మామిడి రైతులు ఎక్కువగా ఉన్నందున కోల్డ్ స్టోరేజ్ ఏర్పాటు చేయాలని రైతులు కోరగా కలెక్టర్ రైతులు ముందుకు వచ్చి అందరు రైతులు సంఘంగా ఏర్పడి కోల్డ్ స్టోరేజ్ నిర్మించుకునే విధంగా చూడాలని ప్రభుత్వం ద్వారా సహాయ సహకారాలు కూడా అందించడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో తహశీల్దార్ ఖాజాబి, మండల అభివృద్ధి అధికారి గౌస్ బాషా,మండల వ్యవసాయ శాఖ అధికారి స్వాతి, మండల ఉద్యానవన శాఖ అధికారి వనిత, పశు వైద్య అధికారి గణేష్, టిడిపి మండల అధ్యక్షులు బాను గోపాల్ రాజు, సింగిల్ విండో ప్రెసిడెంట్ రామేశ్వర్ రాజు, ఎపిఎం ఖాదర్ వలీ, రైతులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కొత్తగా ఎన్నికైన పీలేరు ఎల్ఐసి బ్రాంచ్ కార్యవర్గంతో అతిథులు

బీమా పాలసీని రూ.50 వేలకు పెంచాలి

ప్రజాశక్తి-పీలేరు: జీవిత బీమా సంస్థలో పనిచేస్తున్న ఏజెంట్స్ గ్రూప్ ఇన్సూరెన్స్ పాలసీని రూ.15 వేల నుంచి రూ.50 వేలకు పెంచాలని లైఫ్ ఇన్సూరెన్స్ ఏజెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం పీలేరు బికెఆర్ రెసిడెన్సీలో జీవిత బీమా సంస్థ ఏజెంట్స్ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశానికి హాజరైన జోనల్, డివిజన్ స్థాయి నాయకులు మాట్లాడుతూ విభిన్న వృత్తుల్లోని జీవిత బీమా సంస్థ ఏజెంట్లు క్షేత్రస్థాయిలో వ్యయ ప్రయాసలకోర్చి పనిచేస్తున్నారని, వీరికి, వీరి కుటుంబ సభ్యుల భవిష్యత్తుకు తగిన జీవిత భరోసా కల్పించాల్సిన బాధ్యత జీవిత బీమా సంస్థపై ఉందని అన్నారు. గతంలో ప్రభుత్వం జీవిత బీమా సంస్థలో పనిచేసే ఏజెంట్లకు రూ.25వేలు వృత్తిపరమైన టాక్స్ విధించిందని, వృత్తిపరంగా కనీస ఆదాయం కూడా లేని ఏజెంట్లు చాలా మంది ఉన్నారని, అలాంటివారికి అది చెల్లించడం సాధ్యం కాని భారంగా పరిణమించిందన్నారు. ఏజెంట్ల సమస్యల పరిష్కారానికి ఐకమత్యం చాలా అవసరమని, అందు కోసం యూనియన్ సభ్యులందరూ సఖ్యతతో మెలగాలని పిలుపునిచ్చారు. లైఫ్ ఇన్సూరెన్స్ ఏజెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా డివిజన్ ప్రెసిడెంట్ సుబ్బారావు, కార్యదర్శి సతీష్ బాబు ఆధ్వర్యంలో పీలేరు ఎల్ఐసి బ్రాంచ్ యూనియన్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. యూనియన్ అధ్యక్షులుగా రామకృష్ణ, ప్రధాన కార్యదర్శిగా మధుసూదన్ రెడ్డి, ట్రెజరర్‌గా రమణ, సభ్యులను ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో పీలేరు ఎల్ఐసి బ్రాంచ్ సీనియర్ మేనేజర్ రాధాకృష్ణ, సీనియర్ ఏజెంట్లు సంజీవరెడ్డి, చంద్రశేఖర్, కేశవ, అంజినాయుడు, ఎర్రయ్య, రవి, శివయ్య, చంద్రారెడ్డి పాల్గొన్నారు.

నేటి ర్యాలీని విజయవంతం చేయండి

ప్రజాశక్తి-రాయచోటి: పట్టణంలో గురువారం జరిగే ర్యాలీని విజయవంతం చేయాలని నియోజకవర్గ టిడిపి నాయకులు మండిపల్లి లక్ష్మీ ప్రసాద్‌రెడ్డి బుధవారం పేర్కొన్నారు. అ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాయచోటిని జిల్లా కేంద్రంగా కొనసాగించినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, ఉపసంఘ కమిటీ సభ్యులకు కృతజ్ఞతలు తెలియజేయడానికి ప్రత్యేక ర్యాలీని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పట్టణంలోని చెక్‌పోస్ట్ నుంచి ప్రభుత్వ జూనియర్ కళాశాల వరకు ర్యాలీ ఉదయం 9:30 నిమిషాలకు ప్రారంభమవుతుందన్నారు. ఈ ర్యాలీలో వివిధ సంఘాల నాయకులు, స్వచ్ఛంద సేవ సంస్థలు, ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

6 నుంచి బ్రౌన్ గ్రంథాలయ వారోత్సవాలు

ప్రజాశక్తి-కడప అర్బన్: యోగి వేమన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలోని సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో సి.పి.బ్రౌన్ 142వ వర్ధంతి పురస్కరించుకుని విశ్వవిద్యాలయ విసి ఆచార్య బెల్లంకొండ రాజశేఖర్, ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్ ఆచార్య పి.పద్మ పర్యవేక్షణలో ఈ నెల 6వ తేదీ నుంచి 12 వరకు బ్రౌన్ గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించనున్నట్లు సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సంచాలకులు ఆచార్య జి.పార్వతి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 6వ తేదీ ఉదయం 9 గంటలకు 6, 7, 8వ తరగతుల విద్యార్థులకు పద్య పఠనం, (వేమన, సుమతి శతకాలలోని 6 పద్యాలు) (ప్రతి శతకం నుంచి మూడు పద్యాలు ఉండాలి), 7న ఉదయం 9 గంటలకు 9, 10వ తరగతుల విద్యార్థులకు సి.పి.బ్రౌన్ జీవితం-సాహిత్యం' అనే అంశంపై వక్తత్వం, 8న ఉదయం 9 గంటలకు 3, 4, 5వ తరగతుల విద్యార్థులకు చిత్రలేఖనంలో నచ్చిన చిత్రం, 9న ఉదయం 9 గంటలకు డిగ్రీ కళాశాల విద్యార్థులకు ధారణ పరీక్షలో రామాయణ, భారత, భాగవతాలలోని విషయాలు, 10న ఉదయం 9 గంటలకు 8, 9, 10వ తరగతుల విద్యార్థులకు కథా పూరణం, 11న ఉదయం 9 గంటలకు 8, 9, 10వ తరగతుల విద్యార్థులకు క్విజ్‌లో కడప జిల్లాకు సంబంధించిన వైజ్ఞానిక అంశాలు, 12న సాయంత్రం 5 గంటలకు ముగింపు సమావేశంలో విజేతలకు బహుమతుల ప్రదానం చేయనున్నట్లు పేర్కొన్నారు.

'వినూత్న సంస్కరణలు ప్రభుత్వంతోనే సాధ్యం'

జ్యోతిప్రజ్వలన చేస్తున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

ప్రజాశక్తి-రాయచోటి అర్బన్

విద్య, ఉద్యోగ, ఉపాధి రంగాలలో వినూత్న సంస్క రణలను అమలు చేసిన ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కుతుందని రవాణా యువజన క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి అన్నారు. బుధవారం స్థానిక సాయి ఇంజినీరింగ్ కళాశాల ఆవరణంలో మెప్మా ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా జాబ్ మేళా కార్యక్రమా నికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం విద్య, ఉద్యోగ, ఉపాధి రంగాల్లో వినూత్న సంస్కరణ లు అమలు చేస్తూ, ప్రాథమిక స్థాయి నుంచే విద్యార్థులకు మౌలిక వసతులను అందిస్తోంది. రాష్ట్రంలో పారిశ్రామిక ప్రగతికి ఊతమిచ్చే అనేక పరిశ్ర మలను స్థాపించి యువతకు విస్తృతమైన ఉద్యోగ అవకాశాలు కల్పిస్తోందని తెలిపారు. డిఆర్ఓ మధుసూదన్ రావు మాట్లా డుతూ, ఈ మెగా జాబ్ మేళాలో సుమారు 15 కంపెనీలు పాల్గొన్నాయని, మొత్తం 600 మంది అభ్యర్థులు హాజరై ఇంటర్వ్యూలు ఎదుర్కొన్నారని వివరించారు. వెనుకబడిన ప్రాంతమైన అన్నమయ్య జిల్లాలోని యువత ఇలాంటి అవకాశాలను ఉప యోగించుకుని అభివృద్ధి దిశగా ముందుకు సాగాలని సూచించారు. మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్ పి.లక్ష్మీదేవి మాట్లాడుతూ అభ్యర్థులు వచ్చిన అవకాశా లను సద్వినియోగం చేసుకుని వృత్తిలో ప్రావీణ్యం సంపాదించి ఉన్నత స్థాయి ఉద్యోగాల ను సాధించాలని పిలుపునిచ్చారు. శ్రీ సాయి విద్యాసంస్థల అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ ఎం.సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ ఈ మేళాలో ఎంపికైన 270 మంది అభ్యర్థులకు ఆఫర్ లెటర్‌లు అందజేయడం జరిగిం దన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జీ. రవి, నిపుణ ఆపరేషన్ మేనేజర్ కార్తీక్, అన్నమయ్య జిల్లా డిపిఎంయు, రాయచోటి, రాజంపేట, మదనపల్లి పురపాలక మెప్మా విభాగాల సిబ్బంది పాల్గొన్నారు.

డిజి లక్ష్మీకియోస్ ప్రారంభం : పట్టణంలోని మాసాపేటలో మెప్మా ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన డిజి లక్ష్మి కియోస్క్‌ను మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అందరికీ సమాన అవకాశాలు కల్పించేలా పనిచేస్తుందని, రాయచోటి అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామన్నారు. ఈ కియోస్క్ ద్వారా స్థానికులు నగదు చెల్లింపులు విద్యుత్ బిల్లులు మొబైల్ రీఛార్జ్ తదితర ప్రభుత్వ సేవలను సులభంగా పొందవచ్చని తెలిపారు. కార్యక్రమంలో మెప్మా పి.లక్ష్మీ దేవి, మెప్మా సిబ్బంది,స్థానిక నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలకు సత్వర పరిష్కారం

చిన్నమండెం: ప్రజా సమస్యలకు సత్వర పరిష్కారం లభించేలా చర్యలు తీసుకుంటున్నామని మంత్రి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని బోరెడ్డిగారిపల్లెలో ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. సమస్యలను తక్షణమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. పలు సమస్యలకు ప్రత్యక్షంగా పరిష్కారాన్ని అందించిన మంత్రి ప్రజల్లో విశేష విశ్వాసాన్ని నెలకొల్పారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నిలబెట్టుకుంటున్నామని తెలిపారు. మంత్రిని పలువురు నాయకులు, కార్యకర్తలు దుశ్శాలువా, పుష్పగుచాలతో ఘనంగా సన్మానించారు.

రుణాలపై బ్యాంకులు దృష్టి సారించాలి

- బ్యాంకర్ల సమావేశంలో కలెక్టర్ నిశాంత్ కుమార్

ప్రజాశక్తి-రాయచోటి

బ్యాంకులు ప్రాధాన్యత రంగాలకు ఇచ్చే రుణాలపై దృష్టి సారించాలని, వ్యవసాయం ఉద్యానవన పంటలు, పశుసంవర్ధక రుణాలను ఎక్కువగా మంజూరు చేయాలని కలెక్టర్ నిశాంత్ కుమార్ పేర్కొన్నారు. బుధవారం సాయంత్రం రాయచోటి కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో లీడ్ డిస్ట్రిక్ట్ బ్యాంక్ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన వివిధ బ్యాంకులు, వివిధ శాఖల జిల్లా అధికారులతో జిల్లాస్థాయి సమన్వయ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు.సమీక్ష సమావేశాన్ని జిల్లా ఎల్డిఎం ఆంజనేయులు ప్రారంభిస్తూ జిల్లాలోని బ్యాంకుల రుణాల మంజూరు ఆర్థిక సంవత్సరానికి నిర్దేశించిన లక్ష్యాలు ప్రాధాన్యత రంగాలకు ఇవ్వాల్సిన రుణాలు, కరువు మండలాలకు చేయూత, తదితర అంశాలను కలెక్టర్‌కు కమిటీ సభ్యులకు వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా కాబట్టి బ్యాంకులు వ్యవసాయం, ఉద్యానవన పంటలకు ఇచ్చే రుణాలను ఎక్కువగా మంజూరు చేయాలని ఆదేశించారు. కొన్ని ప్రయివేటు బ్యాంకులు ప్రాధాన్యత రంగాలకు ఇవ్వాల్సిన రుణాల లక్ష్యాలు చేరుకోవడం లేదని తప్పనిసరిగా ప్రాధాన్యత రంగాలకు ఇవ్వాల్సిన రుణాలు మంజూరు చేయాలని ఆదేశించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నమయ్య జిల్లా పర్యటనలో ప్రజల నుండి తీసుకున్న విజ్ఞప్తులలో ముఖ్యమైనది బ్యాంకుల రుణాలు తక్కువగా ఉండడం అని పేర్కొన్నారు. ఇల్లు కట్టుకోవడానికి చాలామంది పేదలు బ్యాంకుల నుండి కాకుండా ప్రయివేటు వ్యక్తుల నుండి రుణాలు తీసుకోవడం వల్ల ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. బ్యాంకులు దీనిపై దృష్టి సారించాలన్నారు. ఆర్థిక అక్షరాస్యతలో సైబర్ నేరాలను చేర్చాలని ఆదేశించారు. డిసెంబర్ 17 నాటికి బ్యాంకులు తమ వద్దనున్న ప్రధానమంత్రి ఎంప్లాయిమెంట్ గ్యారెంటీ ప్రోగ్రాం దరఖాస్తులను ముద్ర యోజన రుణాల దరఖాస్తులను విశ్వకర్మ యోజన రుణాల దరఖాస్తులను ప్రధానమంత్రి సూర్య బిజిలి యోజన ప్రాసెస్ చేయాలని ఆదేశించారు. ప్రధానమంత్రి ధన ధాన్య కృషి యోజనలో రైతులకు రుణాలను మంజూరు చేయాలని ఆదేశించారు. సమావేశంలో ఎల్‌డిఎం ఆంజనేయులు, వివిధ బ్యాంకుల ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

మాట్లాడుతున్న రామలింగారెడ్డి

'ఆదిత్య'లో విదేశీ భాషలపై అవగాహన

ప్రజాశక్తి-మదనపల్లె టౌన్

మదనపల్లె సమీపంలోని ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలలో జపనీస్, ఫ్రెంచ్ భాషల అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించినట్లు డైరెక్టర్ డాక్టర్ ఎస్.రామలింగారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు, విద్యార్థుల్లో విదేశీ భాషలపై అవగాహన పెంపొందించడం, అంతర్జాతీయ స్థాయి అవకాశాలపై అవగాహన కల్పించడమే లక్ష్యంగా ఈ వర్క్‌షాప్ నిర్వహించినట్లు తేలిపారు. ఈ వర్క్‌షాప్‌కు చెన్నైకు చెందిన జపనీస్ లాంగ్వేజ్ ట్రైనర్, నర్మల్‌ఎఫ్రియమ్ రిసోర్స్ పర్సన్‌గా వ్యవహరించారని చెప్పారు. ఆయన విద్యార్థులకు జపనీస్, ఫ్రెంచ్ భాషల ప్రాముఖ్యత, ఉన్నత విద్య, ఉద్యోగ అవకాశాలు, సాంస్కృతిక పరమైన అవగాహన వంటి అంశాలపై విలువైన సమాచారాన్ని అందించారన్నారు. ఆయన నిర్వహించిన ఇంటరాక్టివ్ సెషన్ విద్యార్థుల్లో విశేష ఆసక్తిని రేకెత్తించిందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ రాయుడు విదేశీ భాషల అభ్యాసం ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న అవకాశాలకు దారితీస్తుందని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలోకెరీర్ గైడెన్స్ సెల్ కన్వీనర్ కె.ఈశ్వరరెడ్డి, కార్యక్రమ కో-ఆర్డినేటర్ రెడ్డి ముబారక్ కళాశాల డీన్లు, విభాగాధిపతులు, అధ్యాపకుల విద్యార్థులు పాల్గొన్నారు.

6న జడ్‌పి సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి-కడప అర్బన్

జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల ఆరవ తేదీ నిర్వహిస్తున్నట్లు సిఇఒ ఓబులమ్మ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉద యం 10 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు హాజరు కావాలని తెలిపారు.

పట్టణ సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలి

ప్రజాశక్తి-పీలేరు

పట్టణ ప్రజల సమస్యల పరిష్కారానికి యుద్ధ ప్రాతిపదికన తగిన చర్యలు చేపట్టాలని ఉమ్మడి పార్టీల నాయకులు పీలేరు పంచాయతీ కార్యదర్శి బ్రహ్మానంద రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. బుధవారం స్థానిక పంచాయతీ కార్యాలయంలో కార్యదర్శిని జనసేన పార్టీ ఉమ్మడి చిత్తూరు జిల్లా కార్యదర్శి కలప రవి, టిడిపి యూనిట్ ఇన్‌ఛార్జి వెంకటరత్నం, యూత్ అధ్యక్షుడు నరేష్, మండల ఉపాధ్యక్షులు ధనశేఖర్, జనసేన ప్రధాన కార్యదర్శి గజేంద్ర కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పంచాయతీ పరిధిలోని అన్ని వీధులు, రహదారుల్లో వీధి దీపాలతో పాటు మురుగునీటి కాలువలు, శుద్ధ నీటి ప్లాంట్ల నిర్వహణ సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని ఈవోకు విన్నవించారు.

7న థిల్లానా ప్రతిభా అవార్డుల ప్రదానం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

వివిధ కళా రంగాలలో అసాధారణ ప్రతిభ కనబరుస్తున్న గురువులు, విద్యార్థులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో థిల్లానా ప్రతిష్టాత్మక అవార్డులును ఈనెల 7న ఆదివారం అందించనున్నట్లు నిర్వాహకులు దిలీప్, నాగరాజ్, పునీత్, జస్వంత్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. డాన్స్, సింగింగ్, ఆర్ట్, సామాజిక సేవ వంటి నాలుగు ప్రధాన విభాగాలలో ఈ అవార్డులను ప్రదానం చేయనున్నట్లు తెలిపారు.ప్రతిభావంతులైన కళాకారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అవార్డుల కోసం తమ పేర్లను 5లోపు నమోదు చేసుకోవాలన్నారు.

స్క్రబ్ టైఫస్ వ్యాధి పట్ల ప్రజలకు అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారులు

స్క్రబ్ టైఫస్‌పై అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి-కలికిరి

స్క్రబ్ టైఫస్ వ్యాధిపై గ్రామీణ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మేడికుర్తి పిహెచ్‌సి వైద్యులు డాక్టర్ కావ్యగంధ అన్నారు. మండల కేంద్రం లోని కలికిరి-3 ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌లో నిర్వహిస్తున్న టీకాల కార్యక్రమాన్ని డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ మహమ్మద్ రఫీతో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ కావ్యగంధ మాట్లాడుతూ స్క్రబ్ టైఫస్ వ్యాధి పై ప్రజలకు అవగాహన కల్పించారు. స్క్రబ్ టైఫస్ అనేది ఒక చిగ్గర్ అనే చిన్న పురుగు కాటు వల్ల వచ్చే ఇన్ఫెక్షన్ అని, ఇది సాధారణంగా పొలాలు, గడ్డి, పొదలు, పశువుల కాటిళ్ల వంటి ప్రాంతాల్లో ఎక్కువగా ఉంటుందని, అది కాటు వేసిన చోట నల్ల మచ్చ ఏర్పడి తీవ్రమైన జ్వరం వస్తుందని తెలిపారు. ఈ వ్యాధి వలన 5 రోజులకంటే ఎక్కువగా జ్వరం ఉండుట, శరీరంపై నల్ల మచ్చలు ఏర్పడుతాయని, తలనొప్పి, శరీర నొప్పుల, ఊపిరి తీసుకోవడం లో ఇబ్బంది, బలహీనత, అలసిపోవడం, ఊపిరి తిత్తులు, కిడ్నీ, మెదడు పనిచేయడం లో మందకోడిగా ఉంటాయని తెలిపారు. డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ మహమ్మద్‌రఫీ మాట్లాడుతూ ఈ వ్యాధి నిర్ధారణ కు రక్త పరీక్ష ఏరియా ఆస్పత్రి, జిల్లా ఆస్పత్రిలో ఉచితంగా చేస్తారని, చికిత్స లో భాగంగా డాక్టర్ ఇచ్చే డాక్సీసైక్లిన్ , అజిత్రోమైసిన్ మందులతో పూర్తిగా నయం అవుతుందన్నారు. కార్యక్ర మంలో ఎంఎల్‌హెచ్‌పి నాగరాణి, ఎఎన్ఎం నఫీసా, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

భూకబ్జాపై తహశీల్దార్‌కు ఫిర్యాదు

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

పట్టణంలోని లక్ష్మీ ప్యారడైజ్ థియేటర్‌లోని ఖాళీ జాగాను కొందరు కబ్జా చేసి తమను ఇబ్బందులు పెడుతున్నారని థియేటర్ యజమాని కీ.శే. ఆకుల కృష్ణమూర్తి సతీమణి ఆకుల ఆదిలక్ష్మి, కుమారుడు ఆకుల గిరీష్ బుధ వారం స్థానిక తహసిల్దార్ అమర్నాథ్‌కు ఫిర్యాదును అందజేశారు. ఈ సంద ర్భంగా వారు తహశీల్దార్‌తో మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాలుగా తమ ఆధీనంలో ఉన్న సినిమా హాలును కొంతమంది భూకబ్జాదారులు నిత్యం పలు రకాల ఇబ్బందులకు గురి చేస్తున్నారని మొరపెట్టుకున్నారు. తమకు తెలియ కుండా థియేటర్లోని ఫర్నిచర్‌ను తొలగిస్తున్నారని ఫిర్యాదు చేశారు. తమ వద్ద ఉన్న డాక్యుమెంట్లను పరిశీలించి, కబ్జాదారుల వద్ద ఉన్న పత్రాలను కూడా పరిశీలించి తగు న్యాయం చేయాలని వారు వేడుకున్నారు. ఎస్‌సి, రైల్వే కోడూరు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు వారు తెలిపారు. ప్రయివేట్ వ్యక్తులకు సంబంధించిన స్థలమని అందులో న్యాయ విచారణ చేపట్టి బాధితులకు న్యాయం చేస్తామని తహశీల్దార్ బాధితులకు హామీ ఇచ్చారు.

లక్కీ డిప్‌లో కలికిరి రైతులకు 15 బహుమతులు

ప్రజాశక్తి-కలికిరి

జై కిసాన్ లక్కీ డిప్ స్కీంలో కలికిరి జై కిసాన్ పరిధిలోని రైతులకు 15 బహుమతులు దక్కాయి. మొదటి బహుమతి మండలానికి చెందిన రైతు, ప్రజాశక్తి విలేకరి డేవిడ్ కుమార్‌ను వరించింది. హీరోహోండా యాక్టివాను సొంతచేసుకున్నారు. జువారి కంపెనీ, జై కిసాన్ జంక్షన్ వారు దసరా, దీపావళి సందర్భంగా ఆంధ్ర, తెలంగాణ రెండు తెలుగు రాష్ట్రాల్లో వారి దగ్గర ఎరువులు, పురుగు మందులు కొన్న రైతులకు ధమాకా లక్కీ డీప్ స్కీం కూపన్లు అందజేసి, వారి వివరాలను డ్రా బాక్స్‌లో వేశారు. రెండు రాష్ట్రాల వ్యాప్తంగా డ్రా బాక్స్ లో వచ్చిన కూపన్లను బెంగళూరు వేదికగా లాటరీ పద్ధతి ద్వారా కూపన్లను తీసి విజేతలను నిర్ణయించారు. ఆ లక్కీ డీప్ స్కీంలో కలికిరి జువారి జైకిసాన్ జంక్షన్ పరిధి లోని కలికిరి రైతులకు 15 బహుమతులు వరించాయి. గుట్టపాలెం గ్రామం కే.బర్నేపల్లికి చెందిన అశోక్ కుమార్ 32 ఇంచీల స్మార్ట్ టివి, కాటా సుబ్బారెడ్డికి మొబైల్ ఫోన్, ఇనాయాతుల్లాకు మిక్సీ, వాడవాండ్ల పెళ్లికి చెందిన చలపతి, సుబ్రమణ్యం, యాదగిరి, సహదేవ, కిరణ్, ప్రవీణ్ కుమార్, గణేష్, వేణుగోపాల్ లకు గోడ వాచీలు గెలుచుకున్నారు. విజేతలకు త్వరలోనే బహు మతులు అందిస్తామని కలికిరి మేనేజర్ ఎస్.తరుణ్ తెలిపారు.

ఉపాధ్యాయ పోస్టులకు దరఖాస్తు చేసుకోండి

ప్రజాశక్తి-పుల్లంపేట

పుల్లంపేట మండలంలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని ఎంఇఒలు చక్రధర్ రాజు, నాగతిరుమలరావు తెలిపారు. మండల విద్యాశాఖ పుల్లంపేట ప్రభుత్వ ఉన్నత అధికారుల ఆదేశానుసారం ఈ విద్యా సంవత్సరానికి గాను అకాడమిక్ ఇన్స్ట్రక్టర్ నోటిఫికేషన్ విడుదల చేసినట్లు తెలిపారు. మండలంలో జడ్‌పి హైస్కూల్ బావికాడపల్లెలో స్కూల్ అసిస్టెంట్ బయాలజికల్ సైన్స్ ఖాళీగా ఉండని ఇందుకు బిఎస్‌సి,బిఇడి (బయోలాజికల్ సైన్స్ మెథడాలజీగా)ఉండాలని. టెట్ ఉత్తీర్ణులై ఉండాలన్నారు. మండలంలో రెండు ఎస్‌జిటి పోస్టులకు అకాడమిక్ ఇన్స్ట్రక్టర్లకు అవకాశం ఉందన్నారు. జడ్‌పిహెచ్ఎస్ బీ తప్పేట పల్లె 2, ఎంపిపి ఎస్.దేవసముద్రం. ఈ పోస్టులకు అభ్యర్థులు ఇంటర్మీడియట్‌తో పాటు టిటిసి,డిఇడి టెట్ ఉత్తీర్ణులై ఉండాలన్నారు. సంబంధిత అప్లికేషన్ ఫారం ను ఈనెల 5వ తేదీ సాయంత్రం నాలుగు గంటల లోపల ఎంఇఒ కార్యాలయానికి చేర్చాలని మండల విద్యాశాఖ అధికారులు తెలిపారు. **వీరబల్లి :** మండలంలోని మూడు పాఠశాలలకు అకాడమిక్ ఇన్‌స్ట్రక్టర్లుగా తాత్కాలిక ప్రాతిపదికన పనిచేయుటకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మండల విద్యాశాఖ అధికారులు కె. కృష్ణయ్య. కె.వీర నాగయ్య ఒక ప్రకటనలు తెలిపారు. జడ్‌పి హైస్కూల్ పేరయ్యగారిపల్లి గడికోట, జడ్‌పి హైస్కూలు చమర్తి వాండ్లపల్లిలకు ఒక్కొక్క ఎస్‌జిటి ఉపాధ్యాయ పోస్టులు మంజూరైనట్లు తెలిపారు. ఎంపికైన వారికి గౌరవ వేతనం కింద పదివేల రూపాయలను ఇవ్వనున్నారు. జడ్‌పి హైస్కూలు ఎర్రమ రాజుగారిపల్లి పాఠశాలకు స్కూల్ అసిస్టెంట్ బయాలజీ పోస్టు కు దరఖాస్తు కోరినట్లు తెలిపారు. వీరికి రూ.12,500లు గౌరవ వేతనం క్రింద ఇవ్వనున్నారు. వీరి కాలపరిమితి 08.12.2025 నుంచి 07.05.2026 వరకు ఉంటుంది. అర్హత గల అభ్యర్థులు వారి దరఖాస్తులను స్థానిక మండల విద్యాశాఖ అధికారి కార్యాలయమునకు ఈ నెల 5వ తేదీ సాయంత్రం ఐదు గంటల లోపల అందజేయాలన్నారు. ఆ తర్వాత వచ్చిన దరఖాస్తులను పరిగణలోనికి తీసుకొనబడవు అని తెలిపారు.

జడ్‌పిటిసి చొరవతో కల్వర్టు నిర్మాణం

ప్రజాశక్తి- రైల్వేకోడూరు

కల్వర్టును పరిశీలిస్తున్న జడ్‌పిటిసి రత్నమ్మ

మండలంలోని అనంతరాజుపేట గ్రామ పంచాయతీ పరిధి లోగల రామయ్య పాలెం ఎస్‌టి కాలనీకి వెళ్లే మార్గంలో ఎస్‌టి కాలనీకి చెందిన జడ్‌పిటిసి పాలెం కోటరత్నమ్మ చొరవతో ఆ మార్గంలోని కల్వర్టు నిర్మాణం చేపట్టారు. గత కొన్ని దశాబ్దాలుగా వర్షాకాలంలో గ్రామంతో పాటు 14 గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు గురి అయ్యేవారు, వర్షం వస్తే ఆ మార్గంలో వెళ్లేందుకు వరద ప్రవాహంలో ఇబ్బందులు పడేవారు, ఇబ్బందులను ఇబ్బందులను గమనించిన రామయ్య పాలెం కు చెందిన జడ్పిటిసి రత్నమ్మ జిల్లా పరిషత్ నిధుల నుంచి రూ.30లక్షలు మంజూరు చేయించి కల్వర్టు నిర్మాణానికి దోహద పడ్డారు. ప్రస్తుతం కల్వర్టు నిర్మాణం పూర్తి కావడంతో అటువైపు వెళ్లే ప్రజలు జడ్పిటిసి రత్నమ్మకు కృతజ్ఞతలు తెలిపారు.

CHANGE OF NAME

I Nayani Tejesh (Old Name) R/o 2/65-A, Venkatareddy palli Villege & Post, Kodur Mandal, Annamaiah Dt. I have been changed My name as **NAYANI TEJESH REDDY** (New name) S/o Nayani Maheswara Reddy.

వరి ధాన్యాన్ని ప్రభుత్వానికి విక్రయించాలి

- నాణ్యత ప్రమాణాలతో కొనుగోలు
- పౌరసరఫరాల శాఖ డిఎం వై.సుమతి

ప్రజాశక్తి-నిమ్మనపల్లె

వరి ధాన్యం కొనుగోలు పై సూచనలిస్తున్న పౌరసరఫరాలశాఖ డిఎం సుమతి

రైతులు వరి ధాన్యాన్ని ప్రభుత్వానికి విక్రయించాలని పౌర సరఫరాల శాఖ డిఎం వై.సుమతి తెలిపారు. బుధవారం మండలంలోని కొమ్మిరెడ్డిగారిపల్లెలో మండల వ్యవసాయ శాకాధికారిణి మంజుల ఆధ్వర్యంలో నిర్వహించిన వరి ధాన్యం కొనుగోలు కార్యక్రమంలో డిఎఒ శివ నారాయణ, ఎడిఎ రమేష్‌రాజుతో కలిసి పాల్గొన్నారు. ముఖ్యఅతిథులుగా ఎంపిడిఒ ఫక్రు ద్దీన్ సాహెబ్, ఎఒ రమేష్‌బాబు, వైస్ఎంపిపి జయప్రకాశ్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో రైతులు అత్యధికంగా వరి, టమోటా పంటలను సాగు చేస్తున్నారని తెలిపారు. ప్ర స్తుతం మండల వ్యాప్తంగా వరి పంట దిగుబడి సాధించి కోత దశలో ఉందన్నారు. ఇప్పటివరకు మండలంలో దాదాపు 875 ఎకరాలలో వరి పంటలో కోత దశ ముగిసిందన్నారు. ప్రస్తుతం వర్షాలు ఉన్నందున వరి కోత ఆగిందని, వాతా వరణం అనుకోలించగానే పూర్తిస్థాయిలో రైతులు వరి పంటను కోయడం జరు గుతుందన్నారు. ప్రభుత్వం రైతులు పండించిన పంట దిగుబడులకు గిట్టు బాటు ధరలను కల్పించాలన్న దృఢ సంకల్పంతో ప్రతిష్టాత్మకంగా తీసుకొని సకాలంలో రైతుల నుంచి వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను ప్రారం భించిందన్నారు. రైతులు ప్రయివేట్ వ్యాపారస్తులను, దళారీ వ్యవస్థను నమ్మి మోసపోవద్దని వరి ధాన్యాన్ని ప్రభుత్వానికి విక్రయించి ఆర్థికంగా లాభపడాలన్నారు. వరి ధాన్యంలో తేమశాతం నాణ్యతను పరిశీలించి మొదటి (గ్రేడ్-ఎ) రకం, సాధారణ రకంగా విభజించడం జరుగు తుందన్నారు. మొదటి రకం వరి ధాన్యాన్ని క్వింటాకు (100 కిలోలు) రూ.2389లకు, సాధా రణ రకం వరి ధాన్యాన్ని క్వింటాకు (100 కిలోలు) రూ.2369లకు ప్రభుత్వం కొనుగోలు చేస్తున్నాదన్నారు. వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియ పూర్తి పాం దర్శకంగా జరుగుతుందన్నారు. రైతులు ప్రభుత్వానికి ధాన్యం విక్రయించి వేలిముద్ర వేసిన తర్వాత 48 గంటలలో రైతు ఆధార్ అనుసంధానం కలిగిన బ్యాంకు ఖాతాలో ప్రభుత్వం నుంచి నేరు గా నగదు జమ అవుతుందన్నారు. గోన సంచలు, కూలీలు, రవాణా ఖర్చులు మొదట రైతు భరిస్తే వాటిని కూడా ప్రభుత్వం తిరిగి చెల్లిస్తుందని, లేదా వీటి ఖర్చులను ప్రభుత్వమే కూడా భరించుకుంటుందని తెలిపారు. దళారీ వ్యవస్థను నమ్ముకొని రైతు నష్టపోకూడదు అన్నదే ప్రభుత్వ ఉద్దేశం అని తెలిపారు. రైతులకు అందు బాటులో రైతు సేవా కేంద్రంలోని వ్యవసాయ సహాయకులు నిత్యం అందు బాటులో ఉన్నారని, వారిని సంప్రదించి వరి ధాన్యాన్ని పూర్తి భరోసాతో విక్రయించుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో జిఎస్‌డబ్ల్యూఎస్ అధికారి లక్ష్మీపతి,వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమానికి ప్రభుత్వం కృషి : డిఎఒ

పీలేరు : మాట్లాడుతున్న డిఎఒ శివనారాయణ

ప్రజాశక్తి-పీలేరు

రైతు సంక్షేమం కోసం ప్రభుత్వం వినూత్నంగా రైత న్నా.. మీకోసం కార్యక్రమాన్ని చేపట్టిందని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శివనా రాయణ తెలిపారు. పీలేరు మండలం, బోడుమల్లువారిపల్లె పంచాయతీ సచివా లయంలో బుధవారం జరిగిన రైతన్నా మీ కోసం కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ ప్రభుత్వం తరపున రైతన్నలకు అందుతున్న సాయం, ప్రోత్సా హకాలను ఇంటింటికి తిరిగి తెలియపరుస్తున్నారని తెలిఎపారు. అదే సమ యంలో వారికి దక్కాల్సిన రుణాలు, సబ్సిడీలు, పంటల బీమా తదితర అంశాలపై రైతుల నుంచి ఫీడ్ బ్యాక్ స్వీకరిస్తున్నట్లు చెప్పారు. పంట బీమా, సకాలంలో నాణ్యమైన విత్తనాల పంపిణీ, సమయాన సారంగా ఎరువుల అందజేత వంటి పనులతో కూటమి ప్రభుత్వం రైతులకు సహాయకారిగా ఉంటోందన్నారు. రబీ-2026, ఖరీఫ్-2027, రబీ-2027 సీజన్ల కోసం ప్రత్యేక కార్యాచరణ రూపొందించి అమలు చేస్తున్నామన్నారు. ప్రతి గ్రామంలోనూ పంటల సరళిని అధ్యయనం చేసి రైతులకు ఉపయోగపడేలా పంటల మార్పిడిని సూచిస్తున్నామన్నారు. జిల్లాలోని 12 మండలాల్లో 96 రైతు సేవా కేంద్రాల పరిధిలో వరి సేకరణ చేపట్టామన్నారు. వరి క్వింటాలుకు రూ.2,389లు మద్దతు ధర చెల్లిస్తున్నామని అన్నారు. ఎపిసిఎన్‌ఎఫ్ డిపిఎం వెంకట మోహన్ మాట్లాడుతూ రసాయనిక అవశేషాల కారణంగా పంట ఉత్పత్తులకు తగిన ధరలు రావడం లేదని, రసాయనిక ఎరువుల స్థానంలో మన పూర్వీకుల తరహాలో సేంద్రీయ ఎరువులు వినియోగించాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ విజయ లక్ష్మి, ఏడీ వైవి రమణరావు, ఏవోలు రమాదేవి, కరుణాకర్ రెడ్డి, ఓఇఒ నజీర్, వీఏఏ హిమబిందు, నాయకులు అమరనాథరెడ్డి, బాబు, భానుప్రకాశ్ పాల్గొన్నారు. **రామాపురం:** రాబోవు మూడు సీజన్లలో మండలంలోని 13 పంచాయతీలలోని రైతులకు ఆదాయం పెరిగేలా సమగ్ర ప్రణాళికలు సిద్ధం చేయాలని మండల వ్యవసాయ అధికారి నాగమణి ఆదేశించారు. నల్లగుట్టపల్లి రైతు సేవ కేంద్రంలో బుధవారం రైతన్న మీకోసం కార్యక్రమంలో భాగంగా వ్యవసాయ శాఖ అనుబంధ శాఖలతో కలిసి సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలోని ప్రతి రైతు సేవ కేంద్రంలో రాబోవు మూడు సీజన్లలో రైతుల ఆదాయం పెంచడానికి కావలసిన ప్రణాళికలను రైతులు వ్యవసాయశాఖ అనుబంధ శాఖల అధికారులతో చర్చించారు. కార్యక్రమంలో సిరికల్చర్ ఎఎస్ఒ నాగసుబ్బరాయుడు, నల్లగొండపల్లి, నల్లగుట్టపల్లి రైతు సేవ కేంద్రం విఎఎ మన్సూర్, రైతులు పాల్గొన్నారు. **కలకడ :** రైతన్నా మీకోసం వర్క్ షాప్‌ను రైతులంతా సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయ అధికారి శ్రీనివాస్ పేర్కొన్నారు. రైతు అభ్యున్నతికి సలహాలు, సూచనలు అందించారు. కార్యక్రమంలో ఆర్ఎస్‌కె సిబ్బంది చందన, ఇంద్ర ఎహెచ్ఎ నాగవేణి, నాయకులు పాల్గొన్నారు.ట **నందలూరు :** మండలంలోని నూకినేని పల్లె, లేబాక, నందలూరు, ఆడపూరు రైతు భరోసా కేంద్రాలలో రైతన్న మీకోసం వర్క్ షాప్ నిర్వహించారు. ఆడపూరులో రైతు సేవ కేంద్రంలో నిర్వహించిన రైతన్న మీకోసం వర్క్ షాప్ ప్రోగ్రాంలో మండల వ్యవసాయ అధికారి మల్లికార్జున మాట్లాడుతూ ప్రభుత్వం తెలిపిన ఐదు సూత్రాలను రైతులకు వివరించారు. రాబోయే మూడు సీజన్లో చేపట్టే కార్యక్ర మాల గురించి తెలిపారు. యూరియాను వినియోగించే విధానం గురించి రైతులకు వివరించారు. కార్యక్రమంలో మండల టిడిపి జనరల్ సెక్రటరీ గొబ్బిళ్ళ సుబ్బరాయుడు, మార్కెట్ కమిటీ మాజీ వైస్ ప్రెసిడెంట్ తాటి సుబ్బం రాయుడు, మండల ఐటిడిపి ప్రెసిడెంట్ శ్రీనివాసులు, వ్యవసాయ శాఖ అసిస్టెంట్ విజయ ,వెటర్నరీ అసిస్టెంట్ రెడ్డి ప్రసాద్, రైతులు పాల్గొన్నారు.

విభిన్న ప్రతిభావంతులకు చేయూతనిద్దాం : జడ్జి

ప్రజాశక్తి-పీలేరు

బి.కొత్తకోట : పిల్లలకు దుప్పట్లు పంపిణీచేస్తున్నయంగ్ ఇండియా సభ్యులు

సామాజిక అభివృద్ధిలో విభిన్న ప్రతిభావంతులను కూడా భాగస్వాములు అయ్యేలా చూడాలని 11వ అదనపు జిల్లా జడ్జి మహేష్, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి జియావుద్దీన్ షేక్ తెలిపారు. బుధవారం అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవం సందర్భంగా స్థానిక భవిత కేంద్రంలో జరిగిన కార్యక్రమానికి న్యాయమూర్తులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంత పిల్లల శ్రేయస్సును, వారి అభివృద్ధిని కోరుకుంటూ వారిని అన్ని రంగాలలో ప్రోత్సహించడం లక్ష్యంగా ఉండాలన్నారు. ప్రభుత్వం అన్ని సౌకర్యాలను కల్పిస్తూ వారి విద్యాభివృద్ధికి సహకరిస్తోందని, వీటిని అందరూ సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. సామాజిక అభివృద్ధిలో వీరిని కలుపుకుని పురోగతిని సాధించాలని చెప్పారు. కాబట్టి, ఇలాంటి విద్యార్థులను అందరూ ప్రోత్సహించాలని తెలిపారు. అనంతరం ఆటల పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహు మతులు ప్రధానం చేశారు. కార్యక్రమంలో పీలేరు మండల అభివృద్ధి అధికారి శివ శంకరయ్య, మండల విద్యాశాఖ అధికారిణి పద్మావతి, జిల్లా పరిషత్ ప్రధాన ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు జైపాల్ రెడ్డి, స్పెషల్ ఎడు యకేటర్ లలిత కుమారి, భవిత పాఠశాల ఉపాధ్యాయులు సుబ్రహ్మణ్యం, ధరణిజ, సి.ఆర్.పి మురళీధర్ రాజు, కేర్ గీవర్ వాలంటర్ శైలజ, విద్యార్థుల తల్లిదండ్రులు, న్యాయశాఖ విభాగ సిబ్బంది పాల్గొన్నారు. **మదనపల్లె అర్బన్ :** విభిన్న ప్రతిభావంతులకు ఇంటి స్థలాలు మంజూరు చేయాలని విభిన్న ప్రతిభావంతుల నాయకులు డిమాండ్ చేశారు. బధిరులు, ప్రత్యేక ప్రతిభావంతుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో బుధవారం స్థానిక బేబి వెలకమ్ హోమ్‌లోని రెడ్ క్రాస్ భవనంలో కేక్ కట్ చేసి ఘనంగా ప్రపంచ వికలాంగుల దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి టిడిపి ప్రత్యేక ప్రతిభావంతుల విభాగం నియోజకవర్గ అధ్యక్షులు కంచర్ల వెంకట రమణనాయుడు, వికలాంగుల సంఘం రాష్ట్ర కార్యదర్శి మౌలాలి, ఐటియుసి నాయకులు జి.కృష్ణమూర్తి, సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డెప్ప, మదనపల్లి మండల అధ్యక్షులు నరసింహులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కంచర్ల వెంకటరమణ నాయుడు మాట్లాడుతూ వికలాంగుల సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపాలని విజ్ఞప్తి చేశారు. అర్హులైన వికలాంగు లందరికీ ప్రభుత్వం ఇంటి నివేశ స్థలాలు, పక్కా గృహాలు మంజూరు చేసి కట్టించి ఇవ్వాలని కోరారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో మూడు నుండి ఐదు శాతానికి రిజర్వేషన్లు పెంచి పోటీ చేయడానికి అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. **బి.కొత్తకోట:** భవిత కేంద్రంలో వికలాంగుల దినోత్సవం మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఎంఇఒలు నారాయణ, గౌస్‌పీర్ మాట్లాడుతూ ప్రభుత్వాల నుంచి వికలాంగులకు అందుతున్న పథకాల గురించి వివరించారు. వికలాంగులు ఎందులో తక్కువగా కాదన్నారు. ఎసి సురేంద్ర, ఎఎస్ఐ వరప్రసాద్ మాట్లాడుతూ వికలాంగుల చట్టాల గురించి వివరించారు. పిల్లలకు యంగ్ ఇండియా సేవా ఫౌండేషన్ దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్కూల్ కమిటీ చైర్మన్ రామ్మోహన్ స్కూల్ హెడ్ మాస్టర్ ఎం.ఎన్ సరళాదేవి, భవిత కేంద్రం టీచర్ ఆయేషా, యంగ్ ఇండియా సేవా ఫౌండేషన్ సభ్యులు సూరిరెడ్డి బాషా, కెవి.రమణ, పిల్లల తలిదండ్రులు, పిల్లలు పాల్గొన్నారు.

'మిట్స్'కు ఉత్తమ ఫ్యాకల్టీ చాప్టర్-2025 అవార్డు

ప్రజాశక్తి-మదనపల్లె టౌన్ : మదనపల్లె సమీపంలోని మ మిట్స్ కళాశాలకు ఇండియన్ సొసైటీ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ వారు ఉత్తమ ఐఎస్‌టిఇ ఫ్యాకల్టీ చాప్టర్ అవార్డు-2025 ప్రకటించారు. ఈ విషయాన్ని మిట్స్ ప్రిన్సిపల్ డాక్టర్ పి.రామనాథన్ వెల్లడించారు. ఐఎస్‌టిఇ వారు పుదుచ్చేరిలో నిర్వహించిన 55వ జాతీయ వార్షిక సదస్సులోరాష్ట్రంలోని అన్ని ఛాప్టర్లలో అత్యుత్తమ నాయకత్వం, సాంకేతిక కార్యక్రమాలు, శిక్షణా కార్యక్రమాలు, సేవా కార్యక్రమాల ప్రదర్శన, సాంకేతిక విద్య నాణ్యత ఆధారంగా మిట్స్‌ను ఎంపిక చేసినట్లు ఆయన చెప్పారు. ఈ అవార్డును మిట్స్ ఐఎస్‌టిఇ కో-ఆర్డినేటర్ డాక్టర్ శ్రీ దివ్యకు ఐఎస్‌టిఇ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ ప్రతాప్ సింగ్ కె. దేశాయ్ చేతుల మీదుగా ప్రదానం చేశారు. విద్యార్థులు రూపొందించిన వినూత్న ప్రాజెక్టులు, సాంకేతికత, ఆవిష్కరణ రంగాల్లో కళాశాల ప్రదర్శించిన ఉన్నత ప్రతిభను గుర్తించడమే ఈ పురస్కారం ప్రధాన కారణం అని డాక్టర్ రామ నాథన్ తెలిపారు. మిట్స్ యూనివర్సిటీ స్థాపకులు, ఛాన్సలర్ డాక్టర్ ఎన్.విజయభాస్కర్‌చౌదరి, ప్రోఛాన్సలర్ యెన్. ద్వారకానాథ్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కీర్తి నాదెళ్ల, వైస్ ఛాన్సలర్ డాక్టర్ సి. యువరాజ్ కృతజ్ఞతలు తెలిపారు.

స్వామిత్వ పేదలకు వరం

రాయచోటి-అర్బన్ : స్వామిత్వ మ్యాపింగ్ కార్యక్రమం భూమి హక్కుదారులకు వరం లాంటిదనీ టిడిపి రాయచోటి రూరల్ మండలం అధ్యక్షుడు గండికోట సుధాకర్, నేత కొండారెడ్డి అన్నారు. రూరల్ మండలం చనముక పల్లె గ్రామం ధూళ్ళ వారిపల్లెలో రాయచోటి ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యురాలు లక్ష్మీదేవి అధి కారులు సచివాలయ సిబ్బందితో కలిసి స్వామిత్వ మ్యాపింగ్ కార్యక్రమంలో పాల్గొ న్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వారు మాట్లాడుతూ ఈ పథకం ఆస్తి సరిహ ద్దులను ఖచ్చితంగా గుర్తించడానికి మరియు యాజమాన్య హక్కు లను స్థాపించడానికి డ్రోన్‌లు, ఇతర సాంకేతిక సాధనాలను ఉపయో గిస్తుం దన్నారు. స్వామిత్వ పథకం ప్రధాన లక్ష్యం గ్రామీణ నివా సితులకు వారి నివాస ఆస్తుల క్రమబద్ధమైన డాక్యు మెంటేషన్ ద్వారా సాధికారత కల్పిం చడం, తద్వారా పారదర్శకతను ప్రోత్సహిం చడం మరియు సంభావ్య యాజమాన్య వివాదాలను పరిష్కరించినట్లు చెప్పారు. ప్రణాళిక, ఆదాయ సేకరణను క్రమ బద్ధీకరించడం, గ్రామీణ ప్రాంతాల్లోని ఆస్తి హక్కుల గురించి తెలియ జేయడం ఈ పథకం లక్ష్యమన్నారు. కార్యక్రమంలో దూళ్ళ వారిపల్లె ప్రజలు, రైతులు పాల్గొన్నారు.

ఉవ్వెత్తున జిల్లా కేంద్రం సాధన ఉద్యమం

ప్రజాశక్తి-రాజంపేట : జిల్లా కేంద్రం సాధన ఉద్యమం ఉవ్వెత్తున ఎగిసి పడింది. రాజంపేట, రైల్వే కోడూరు నియోజకవర్గాల ప్రజల ఆకాంక్ష, అన్నమయ్య జన్మస్థలి సెంటిమెంట్ కూటమి ప్రభుత్వానికి తెలిసేలా బుధవారం జెఎసి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే అరవ శ్రీధర్, జనసేన పార్టీ రాజంపేట పార్లమెంటు ఇన్‌ఛార్జి యల్లటూరు శ్రీనివాసరాజు, జనసేన పార్టీ రాజంపేట పార్లమెంట్ సమన్వయకర్త అతికారి కృష్ణ, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ బాధ్యులు పూల భాస్కర్, టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ చెన్నూరు సుధాకర్, టిడిపి నాయకులు లక్ష్మీనారాయణ, డాక్టర్ నవీన్ చంద్ర తదితర అఖిలపక్ష నాయకులు రెండు నియోజకవర్గాలలోని ప్రజలతో పాత బస్టాండు కూడలి వద్ద మానవహారంగా ఏర్పడి రాజంపేటను అన్నమయ్య జిల్లా కేంద్రంగా ప్రకటించాలని నినాదాలు చేశారు. అనంతరం అక్కడి నుంచి సబ్ కలెక్టర్ కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అఖిలపక్ష నేతలు మాట్లాడుతూ రోడ్లు, రైల్వే, విమానయాన సౌకర్యాలు కలిగి., విశాలమైన సబ్ కలెక్టర్ కార్యాలయం ఉందన్నారు.బద్వేలు, రైల్వేకోడూరు, రాజంపేట నియోజకవర్గాలతో కూడిన అన్నమయ్య జిల్లాగా రాజంపేటను ప్రకటించి చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీని నెరవేర్చుకోవాలని కోరారు. అనంతరం సబ్ కలెక్టర్ హెచ్.ఎస్ భావనకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో రాజంపేట, రైల్వే కోడూరులోని అఖిలపక్ష నేతలు, కార్యకర్తలు, విద్యాసంస్థల అధినేతలు, వ్యాపారస్తులు, కుల సంఘాలు, విద్యార్థి సంఘాలు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

బదిలీపై వెళ్తున్న వైద్యసిబ్బందిని సన్మానిస్తున్న డాక్టర్ శంకర్

బదిలీపై వెళ్తున్న వైద్య సిబ్బందికి సన్మానం

ప్రజాశక్తి-బి.కొత్తకోట

మండలంలోని కందుకూరు ప్రభుత్వ ఆసుపత్రిలో విధులు నిర్వహిస్తున్న ఎంపిహెచ్ఇఒ ఈశ్వరయ్య, ఎంపిహెచ్ఎస్ మహబూబ్ బాషా, ఎఎన్ఎంలు అరుణ, భారతి, రామలక్ష్మి బదిలీ అయ్యారు. బుధవారం వారిని కందుకూరు పిహెచ్‌సి డాక్టర్ శంకర్ శాలువా, పూలమాలలతో ఘనంగా సన్మా నించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విధి నిర్వహణలో సిబ్బంది ఎంతో నిబద్ధత పనిచేశారని,ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించారని ప్రశం సించారు. ఇన్ని రోజులు తమతోపాటు పనిచేసి బదిలీపై వెళ్లడం బాధగా ఉన్నప్పటికీ, ఉద్యోగుల బదిలీలు సర్వసాధార ణమేనన్నారు. బదిలీపై వెళ్తున్న ఉద్యోగులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, ఎక్కడికి బదిలీ అవుతున్నారో ఆ ప్రాం తంలో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు.

మెగా పేరెంట్స్‌డేను ఘనంగా నిర్వహించాలి

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ఈనెల 5న నిర్వహించనున్న మెగా పేరెంట్స్‌డే కార్యక్రమాన్ని మండలంలోని పాఠశాలలలో ఘనంగా నిర్వహించాలని ఎంఇఒ పద్మావతి, ఎంపిడిఒ ఫక్రుద్దీన్ సాహెబ్ అన్నారు. బుధవారం మం డలంలోని పాఠశాలను, నిమ్మనపల్లిలోని ఉర్దూ పాఠశాలను సందర్శించి కార్య క్రమం నిర్వహణపై ఉపాధ్యాయులకు పలు సూచనలను చేశారు. పాఠశాల ఆవర ణాన్ని పరిశుభ్రంగా, సుందరంగా ఉంచాలన్నారు. మెగా పేరెంట్స్ డే రోజున విద్యార్థులతోపాటు వారి తల్లిదండ్రులకు మధ్యాహ్నం భోజనాన్ని ఏర్పాటు చేయా లన్నారు. పాఠశాల వాతావరణం ఆహ్లాదకరంగా ఉండేలా ఏర్పాటు చేసుకో వాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అందే నాణ్యమైన విద్య, పోషకా హారంతో కూడిన మధ్యాహ్న భోజనం, విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న సౌక ర్యాలపై సమగ్రంగా విద్యార్థుల తల్లిదండ్రులతో చర్చించుకోవాలన్నారు. పాఠశాల అభివృద్ధి కొరకు కమిటీ సభ్యులతో కలసి తల్లిదండ్రుల నుంచి సూచనలు, సలహాలను స్వీకరించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రభుత్వం తీసు కుంటున్న నిర్ణయాలను విద్యార్థుల తల్లిదండ్రులకు వివరించాలని తెలిపారు. విద్యార్థులు చదువు పట్ల ఆసక్తిని పెంపొందించుకొని ప్రభుత్వ పాఠ శాలల్లో విద్యను అభ్యసించడానికి ఆసక్తి చూపేలా వారిని ప్రోత్సహించడానికి ఉపాధ్యాయులు తమ వంతుగా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం అపర్ణాదేవి, ఉపాధ్యాయులు నాదిర్‌షావలి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎంఇఒలు

క్రైం కార్నర్

పెన్షనర్‌ను మోసగించిన అపరిచితుడు

- రూ.లక్షతో ఉడాయించిన వైనం
- పోలీసులకు ఫిర్యాదు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

పెన్షన్‌తో జీవనం కొనసాగిస్తున్న పెన్షనర్‌ను ఓ అపరిచితుడు బూటకపు మాటలతో నమ్మించి లక్ష రూపాయలతో ఉడాయించిన సంఘటన బుధవారం మదనపల్లి పట్టణంలో వెలుగు చూసింది. బాధితుని ఫిర్యాదు మేరకు.. పట్టణంలోని ప్రశాంత్ నగర్‌కు చెందిన శ్రీనివాసులు ఆరోగ్య శాఖలో విధులు నిర్వహిస్తూ 15 ఏళ్ల క్రితం రిటైర్ అయ్యారు. తనకు వస్తున్న పెన్షన్లో గత రెండు, మూడు మాసాలుగా వ్యత్యాసం వస్తుండడంతో ఏమి జరిగిందో కనుక్కోవడానికి బుధవారం స్థానిక ట్రెజరీ కార్యాలయానికి వెళ్ళాడు. అక్కడ ఓ అపరిచిత వ్యక్తి ఎదురై ఏమి కావాలని శ్రీనివాసులును ప్రశ్నించాడు. తాను పెన్షనర్ నని, తనకు వస్తున్న పెన్షన్‌లో తేడా వస్తుండడంతో కనుక్కోవడానికి వచ్చానని చెప్పాడు. ఆ శాఖను తానే చూస్తానని, ప్రస్తుతం అందరూ మీటింగ్‌లో ఉన్నందున ఇప్పుడు చెప్పలేమన్నాడు. అంతటితో ఆగకుండా ప్రభుత్వం పెన్షనర్లకు మంజూరు చేస్తున్న ఐదు లక్షలకు దరఖాస్తు చేసుకున్నావా అని అపరిచితుడు ప్రశ్నించాడు. ఆ విషయం తనకు తెలియదని చెప్పడంతో అయ్యయ్యో ఎంత పొరపాటు చేస్తున్నావు.. పెద్దాయన, ఈ రోజే ఆఖరు తేదని రూ.1.30 లక్షలు డిపాజిట్ చేయాలని, దీనివల్ల మీకు ప్రభుత్వం రూ.5 లక్షలు మంజూరు చేస్తుందని తెలిపారు. డబ్బులు తిరిగి కట్టనవసరం లేదని నమ్మబలికాడు దీంతో అతని మాటలను నమ్మిన శ్రీనివాసులు పరుగు పరుగున అల్లుడు మోహన్ వద్ద వెళ్లి విషయం చెప్పి లక్ష రూపాయలు తీసుకొని కార్యాలయానికి వచ్చాడు. అతనివద్ద రూ. లక్ష తీసుకున్న అపరిచిత వ్యక్తి ఆధార్ కార్డు, పాన్ కార్డు జిరాక్స్ తీసుకురమ్మని శ్రీనివాసులును జిరాక్స్ షాపుకు పంపాడు. అతను జిరాక్స్ తీసుకొని వచ్చే లోపల అపరిచిత వ్యక్తి లక్షతో ఉడయించాడు. ఆ పెద్దాయన ఎక్కడా వెతికిన కనబడలేదు. ట్రెజరీ కార్యాలయంలో విచారించగా అదంతా బూటకమని ఎవరో నిన్ను మోసం చేశారని తేల్చేశారు. మోసపోయానని తెలుసుకున్న శ్రీనివాసులు ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్ కు వెళ్ళి సిఐ మహమ్మద్ రఫీకి ఫిర్యాదు చేశాడు. వెంటనే పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి సిసి పుటేజ్ లను సేకరించారు. విచారణ చేస్తున్నామని, కేసు నమోదు చేస్తామని సిఐ తెలిపారు

గుర్తుతెలియని వృద్ధుడు మృతి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మండల పరిధిలోని కొత్తపల్లి వద్ద గుర్తు తెలియని వృద్ధుడి మృతదేహం లభ్యమైనట్లు తాలూక ఎస్ఐ చంద్రమోహన్ తెలిపారు. మండలంలోని కొత్తపల్లి పంచాయతీ, చెంబకూరు రోడ్డులో 70 సంవత్సరాలు పైబడి ఉన్న ఓ గుర్తు తెలియని వృద్ధుడు బుధవారం మృతి చెందాడని తెలిపారు. గ్రామస్తులు గుర్తించి, తాలూకా పోలీసులకు సమాచారం అందించడంతో వెంట నే వెళ్లి మృతదేహాన్ని పరిశీలించి పంచనామా అనంతరం, జిల్లా ప్రభుత్వ ఆసు పత్రి మార్చురీకి తరలించామన్నారు. మృతుడి వివరాలు తెలియాల్సి ఉందని, ఆచూకి తెలిసిన వారు తాలూకా పోలీసులను సంప్రదించాలనితెలిపారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న లారీ

- డ్రైవరుకు తీవ్ర గాయాలు

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల పరిధిలోని అనంతం పల్లె గ్రామం సినిమా హాలు మలుపు వద్ద కడప-రేణిగుంట జాతీయ రహదారిపై బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో లారీ డ్రైవర్ తీవ్రంగా గాయపడ్డాడు. వివరాల్లోకి వెళ్తే.. హైదరాబాదు నుంచి చెన్నై వెళుతున్న లారీ అనంతంపల్లె సమీపంలోకి రాగానే విద్యుత్తు స్తంభాన్ని ఢీకొనడంతో లారీ డ్రైవర్ తీవ్రంగా గాయపడ్డాడు. గాయపడ్డ లారీ డ్రైవర్‌ని రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. గతంలో అనేకసార్లు ఇక్కడ రోడ్డు ప్రమాదాలు జరిగా యని గత ఆరు నెలల క్రితం ఒక లారీ విద్యుత్ స్తంభాన్ని ఢీకొనడంతో గతంలో ఒక డ్రైవర్ తీవ్రంగా గాయపడ్డారని కూడా స్థానిక ప్రజలు తెలిపారు. కావున ఇక్కడ రోడ్డు ప్రమాదాలు జరగకుండా నివారించడానికి పోలీసులు బారికేడ్లు ఏర్పాటు చేయాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ ఘటనపై పోలీసులు విచారణ చేపట్టారు.